క్లుప్తంగా

వేడుకగా సాయినాథుడి గ్రామోత్సవం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బొమ్మలసత్రంలో వెలసిన శ్రీషిర్డి సాయిబాబా మందిరం సభ్యుల ఆధ్వర్యంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని గురువారం సాయినాథుడి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీగౌరీ శంకర్‌సాయి సంఘం ఆధ్వర్యంలో బాబాను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుంచి పురవీధుల్లో ఊరేగించారు. ఎంఎస్‌నగర్, మూలసాగరం, బొమ్మలసత్రం గుండా కొనసాగింది. జూలై 3వ తేదీన గురుపౌర్ణమిని పురస్కరించుకొని నాగులకుంట రోడ్డులోని శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో షిర్డిసాయిబాబా సేవా సమితి సభ్యులు కరపత్రాలను విడుదల చేశారు.

ఏకలవ్యుడి జయంతి

ఆళ్లగడ్డ: ఏలలవ్యుడి జయంతిని పట్టణంలో గురువారం నిర్వహించారు. స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు గంగన్న, బైరి బాలరాజు,నాసారి రమేష్ ఉన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రవిచంద్రారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

గోస్పాడు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజన్ ప్రారంభమవుతుండటంతో పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. వచ్చేనెల 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు.

నిబంధనలు పాటించాలి

గోస్పాడు: వాహనదారులు రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ మల్లికార్జున అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం మాట్లాడుతూ వాహనాల్లో అధిక లోడు వేసుకోరాదని, బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, సురక్షితంగా గమ్యస్థానాలను చేర్చాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో మత్తు పదార్థాలు తీసుకోరాదని పేర్కొన్నారు.

అనాథలకు అన్నదానం

నంద్యాల(అర్బన్): భాను రూరల్ అండ్ అర్బన్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు రవికాంత్‌బాబు ఆధ్వర్యంలో గురువారం అనాథలకు అన్నదానం చేశారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లోని నిరుపేదలు, అనాథలకు అన్నదానం చేపట్టారు. రవికాంత్‌బాబు మాట్లాడుతూ బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నదానం చేసినట్లు చెప్పారు. సొసైటీ సభ్యులు విజయ్‌పాల్, అజయ్, హనుమంతు, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు 'గడగ గడపకు మన ప్రభుత్వం'

ఆళ్లగడ్డ: మండలంలోని ఆర్. కృష్ణాపురం సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ గురువారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

పరిహారం మంజూరు

రుద్రవరం: మండలంలో గత ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట దిగుబడులు సరిగ్గా రానందున నష్టపోయిన రైతులకు బీమా పరిహారంను ప్రభుత్వం విడుదల చేసిందని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ గురువారం తెలిపారు. మండలంలో 657 మంది రైతులు 690.61 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని, వారికి రూ.1.55 కోట్లు విడుదలైందని చెప్పారు.

భక్తి శ్రద్ధలతో స్వాతి వేడుకలు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం స్వాతి నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, స్నపన తిరుమంజన సేవలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చన జరిపించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలని, అమ్మ ఒడి పథకానికి షరతులు లేకుండా వర్తింపజేయాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. గురువారం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో నంద్యాల డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. రాంబాబు, పవన్, మద్రిస్వామి, సతీష్, శివ, రాజు, వినోద్ పాల్గొన్నారు.


సాయిబాబాగనర్ కుబ్రా ఈద్గాలో ప్రార్థనలో పాల్గొన్న హబీబుల్లా


ఎస్పార్బీసీ ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు


చిన్నారులతో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

త్యాగానికి ప్రతీక బక్రీద్


చాగలమర్రి ఈద్గా మైదానంలో ఇదుల్-అజ్హా నమాజుకు హాజరైన ముస్లింలు

- ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- పర్వదినం విశిష్టతను వివరించిన మత పెద్దలు

నంద్యాల(వ్యవసాయం): త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 6 గంటల నుంచే మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ప్రవక్త హజరత్ ఇబ్రహీం అలైహిసలాం ఆయన కుమారుడు ఇస్మాయిల్ అలైహిసలాంలు చేసిన త్యాగాలు స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు. భీమవరం రస్తాలో ఆల్‌ఫుర్ఖాన ఈద్గాలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, సాయిబాబానగర్‌లోని కుబ్రా ఈద్గాలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మజీద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం కుర్బానీ నిర్వహించారు. ఆల్‌ఫుర్ఖానా ఇమాం మౌలానా హాఫీజ్ అబ్దుల్ హాదీ ఆధ్వర్యంలో, బొమ్మలసత్రంలోని ఈద్గాలో మౌలానా మహబూబ్‌బాషా, సాయిబాబానగర్‌లోని ఖుబ్రాఈద్గా అంజాద్‌బాషా సిద్ధిఖీ, ఎస్పార్బీసీ కాలనీకి వెళ్లే రహదారిలో తొయిబా ఈద్గాల వద్ద మౌల్వీఅబ్దుల్ మన్నన్, జుమ్మామసీదు, అంటికోట మసీదు, గాంధీచౌక్ మసీదు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, డబరాల మసీదులో ముస్లింలు ఈదుల్ జుహా ప్రార్థనలు చేశారు. ఇమాంల సంఘం అధ్యక్షుడు అంజాద్‌బాషా సిద్ధిఖీ మాట్లాడుతూ ప్రతి మనిషి ప్రవక్త సూచించిన ఆధ్యాత్మిక ధర్మ పథంలో జీవించాలని, ఓర్పు, సహనాన్ని పెంచుకోవాలని సూచించారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

గోస్పాడులో...
మండలంలోని గ్రామాల్లో గురువారం ముస్లింలు బక్రీద్ వేడుకలను నిర్వహించారు. ముస్లింలు గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దొర్నిపాడు: త్యాగానికి ప్రతీకగా పిలుచుకునే బక్రీదు పండుగను గురువారం మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. డబ్ల్యూ.గోవిందిన్నె, దొర్నిపాడు, క్రిష్టిపాడు, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, గుండుపాపల, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డబ్ల్యూ గోవిందిన్నెలో వైఎస్సార్‌సీపీ నాయకులు జాకీర్‌బాషా, రఫీ, కరిముల్లాలు పేద ముస్లింలకు కుర్బాని అందజేశారు.

చాగలమర్రి: త్యాగానికి మారుపేరైన బక్రీద్ పండుగ పర్వదినాన్ని ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక అరబ్ మస్జిద్ నుంచి బయలు దేరి మొయిన్ బజారు మీదుగా గ్రామ శివారులోని అడ్డువాగు సమీపంలోనున్న ఈద్గా మైదానానికి ముస్లింలు తరలి వచ్చారు. ఖాజీ మౌల్వి ముల్లా ముజీబ్ ఆధ్వర్యంలో ఇదుల్-అజ్హా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఖాజీ ముల్లా యూనుస్ పండుగ ప్రశస్త్యాన్ని వివరించారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శిరివెళ్ల: మండలంలో గురువారం బక్రీదు పండుగ ఘనంగా జరిగింది. మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక నమాజు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్‌ఐ సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉయ్యాలవాడ: ఇబ్రహీం, ఇస్మాయిల్, జబీవుల్లా త్యాగాలకు స్మరించుకుంటూ ముస్లింలు గురువారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు శంశులుద్దీన్ బక్రీద్ పండుగ విశిష్టతను క్లుప్తంగా వివరించారు.

రుద్రవరం: మండలంలో బక్రీదు పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఉదయమే నూతన దుస్తులు ధరించి ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు కుర్బాని అందజేశారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డిని బక్రీదు సందర్భంగా ఎరగుడిదిన్నె గ్రామంలో ముస్లిం నాయకుడు నజీర్ ఘనంగా సత్కరించారు.


బక్రీద్ ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న మౌళ్వి ఖాజి ముజీబ్


ఎమ్మెల్యే గంగులను సన్మానిస్తున్న దృశ్యం


శిరివెళ్ల ఈద్గా వద్ద నమాజు చేస్తున్న ముస్లింలు


మతగురువుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎస్‌ఐ రామకృష్ణారెడ్డి

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు


సంజీవనగర్ రామాలయంలో ఒట్టివేర్లు, మత్స్య అవతారం అలంకరణలో వేంకటేశ్వరస్వామి


గాంధీచౌక్‌లోని శ్రీకృష్ణ భజన మందిరంలో విశేష అలంకరణలో శ్రీకృష్ణ భగవానుడు


ఇంజేడు శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

నంద్యాలవ్యవసాయం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో పలు దేవాలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో గురువారం పూజలు నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు మంగళ స్నానాలు నిర్వహించి ఉపవాస దీక్షలతో పూజలు చేపట్టారు. స్వామి వారికి నైవేద్యంగా వడపప్పు, పానకం, పేల పిండి వంటివి సమర్పించారు. ఉపవాస దీక్షతో రాత్రి విష్ణుసహస్ర నామావళిలు, జపాలు, పారాయణం గావిస్తూ జాగారణలు చేశారు. సంజీవనగర్ రామాలయంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి రోగనిరోధక శక్తిని పెంపొందించే ఒట్టివేర్లతో గజమాల, మత్స్యావతార రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో స్వామివారిని అలంకరించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను చేపట్టారు. గుడిపాటిగడ్డలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వార్లకు ఉదయమే పంచామృతాభిషేకాలు, సుప్రభాతసేవ, స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు.

- పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణమందిరం, గాంధీచౌక్‌లోని శ్రీకృష్ణ భజన మందిరంలో స్వామి వారికి ఉదయమే పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, స్నపన మందిర సేవలు జరిపించారు. కాళికాంబ దేవస్థానంలో అమ్మవారికి ఆషాడ మాసం పురస్కరించుకొని భక్తులు పుట్టింటి పట్టుచీర, సారెను సమర్పించి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. నాగులకుంట రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, హారుతులు ఇచ్చారు.

గోస్పాడులో...
మండలంలోని గ్రామాల్లోని ప్రజలు గురువారం తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి, శ్రీకృష్ణమందిరం, రామాలయం, ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాస దీక్షలతో రాత్రి భజనలు, విష్ణుసహస్ర నామాలు, పారాయణాలు నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలో గురవారం ఏకాదశి పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆయా ఆలయాలకు వెళ్లి పూజలు చేపట్టారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో వెలసిన శ్రీషిరిడి సాయి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు.

ఉయ్యాలవాడ : ఆషాడ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. హిందూ సంప్రదాయ ప్రకారం ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లో తొలి ఏకాదశి ఇతర పండుగలకు నాంది పలికే పర్వదినం కావడంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇంజేడు గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామం నుంచే కాకుండా వివిధ గ్రామాల భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. అర్చకులు అనంతయ్య, రమణయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, మహా మంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు.

వైభవంగా రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం
నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రంగరాజు వీధిలో వెలసిన శ్రీరుక్మిణి పాండురంగస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని శ్రీరుక్మిణీ పాండురంగ స్వామి కల్యాణం భావసార్ క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయన్నే స్వామి, అమ్మవార్లకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ చేపట్టి పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం పండితులు వేదయుక్తంగా కల్యాణం జరిపించారు.


కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులు


సంజీవనగర్ రామాలయంలో సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ధరల మోత

- కొండెక్కిన కూరగాయల ధరలు
- చాగలమర్రి మార్కెట్‌లో కిలో పచ్చిమిర్చి రూ.120, కిలో టమాటా రూ.120.
- అల్లం కేజీ రూ.280 నుంచి 300

టెక్కె రైతుబజార్‌లో కూరగాయల ధరలు ఇలా..

కూరగాయ	ఏప్రిల్‌లో	జూన్‌లో
టమాటా	10	100
వంకాయ	30	50
కాకర	30	60
బీరకాయ	40	60
ఉల్లిగడ్డలు	15	20
చిక్కుడు	60	80
మట్టికాయ	30	45
క్యాబేజీ	20	30
క్యారెట్	36	70
దోసకాయ	30	40
బీన్స్	70	100
పచ్చిమిర్చి	44	120
దొండకాయ	30	40
క్యాలీఫ్లవర్	25	50
ముల్లంగి	30	44
బీట్‌రూట్	34	50
అల్లం	60	300

నంద్యాల(అర్బన్)/చాగలమర్రి: వారం నుంచి కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గత వారం రూ.60గా ఉన్న పచ్చిమిర్చి ధర ఒకే సారి రూ.120, టమాటా రూ.100కు పెరిగింది. గత వారం తక్కువ ధరలు పలికిన బీర, కాకర, చిక్కుడు కేజీ రూ.100, వంకాయ కేజీ రూ.50, క్యారెట్ రూ.80, ఆలుగడ్డ రూ.50, బెండ రూ.60 పలుకుతుండగా..అల్లం కాస్త ప్రత్యేకతను చాటుకుంటోంది. రెండు నెలల నుంచి కేజీ రూ.120 నుంచి రూ.180 ఉన్న ధర నేడు రూ.300 వరకు పలుకుతోంది. ఇక వంటల ఘుమఘుమలకు వాడే కొత్తిమీర, మెంతికూర, పుదీన కట్ట ప్రస్తుతం రూ.50గా ఉంది. కేజీ రూ.40 ఉన్న మునక్కాయల ధర రూ.80లకు పెరిగింది. రూ.500 వెచ్చించినా చిన్న చేతి సంచి నిండటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. అయితే ధరల పెరుగుదలకు ఎండల కారణంగా ఉష్ణోగ్రతలే కారణమని , వేడిమి కారణంగా బోర్లలో నీటి ధారలు పడిపోయాయని దీంతో కూరగాయల పంటల సాగు, దిగుబడి పడిపోయిందని రైతులు పేర్కొంటున్నారు. స్థానికంగా కూరగాయల ఉత్పత్తి పడిపోవడంతో బెంగళూరు, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి హోల్‌సేల్ వ్యాపారుల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయల ధరలు పేదలకు అందనంత ఎత్తుకు చేరుకుంటున్నాయి. జిల్లా కేంద్రంలోని రైతుబజార్ ధరల పట్టికలో రేట్లు తక్కువగా ఉంటున్నా వ్యాపారులు వినియోగదారుల నుంచి ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఏ కూరగాయ తీసుకున్నా కిలో రూ.80కి పైమాటే. దీంతోపాటు వీధుల్లోకి వచ్చే బండ్ల వ్యాపారులు కిలో మీద రూ.20 నుంచి రూ.30కి పెంచి విక్రయిస్తుండటంతో వినియోగదారులకు కొనలేని పరిస్థితి.

తప్పని పరిస్థితుల్లో కొంటున్నా



ఇంట్లో వాళ్లు కూరగాయలు తీసుకురమ్మంటారు. దీంతో ఎంత ఖర్చయినా పెట్టి తీసుకుపోవాల్సి వస్తోంది. రేట్లు చూస్తే భగ్గుమంటున్నాయి. ధరల పట్టికలో ఉన్న దానికి.. వ్యాపారులు అమ్మే దానికి సంబంధమే లేదు. టమాట రూ.70 అని బోర్డులో వేశారు. కొనేందుకు పోతే రూ.80 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు.
– ఏహియా, పోలూరు, నంద్యాల

కొనుక్కోలేకపోతున్నాం



రోజురోజుకు కూరగాయల ధరలు పెరుగుతున్నాయి.ధరలను చూసి కొనాలంటేనే భయం వేస్తుంది. వ్యాపారులు ధరలను అమాంతం పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. పావుకిలో, అరకిలోలతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది.
– శంకరమ్మ, బాలాజీ కాంప్లెక్స్, నంద్యాల

ఆర్టీసీ ఉచిత సేవ


విద్యార్థి బస్సు

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు, దివ్యాంగులకు ఆర్టీసీ తన వంతు సేవ చేస్తోంది. రాయితీ, ఉచిత పాసులు అందజేసి వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతోంది. నంద్యాల జిల్లాలోని ఏడు ఆర్టీసీ డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత,రాయితీ బస్సు పాస్‌లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థుల చదువులకు ఊతమిచ్చేలా ఏటాఆర్టీసీ బస్సు ఉచిత, రాయితీ పాస్‌లు జారీ చేస్తోంది. ఈ ఏడాది కూడా పాసుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ మేరకు www.apsrtc pass.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది జూన్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు పాసులు చెల్లుబాటు అవుతాయి.

విద్యార్థులకు..
ఆర్టీసీ ఏటా విద్యార్థులకు ఉచిత పాసులు అందిస్తుంది. బాలురుకు 12 ఏళ్లు నిండే వరకు, బాలికలకు 18 ఏళ్లు నిండే వరకు ఉచిత పాసులు అందిస్తున్నారు. ఈ పాసుల ద్వారా విద్యార్థులు తమ నివాసం నుంచి 20 కి.మీ. వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందు కోసం విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి (బోనిఫైడ్ సర్టిఫికెట్) ధ్రువ పత్రం సమర్పించాలి. పాసు ఐడెంటిటీ కార్డు నిమిత్తం రూ.50 చెల్లించాలి.

దివ్యాంగులకు..
ఆర్టీసీదివ్యాంగులకు కూడా ఉచిత పాసులు అందిస్తోంది.సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు,అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాలి. మూడేళ్ల కాల వ్యవధిలో పాసులు జారీచేస్తారు.ఐడీకార్డుకు రూ.100 చెల్లించాలి.

రాయితీ పాసులు..
చదువుకునే ప్రతి ఒక్కరూ ఈ పాసు పొందవచ్చు. చార్జీలో ఒక వంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా ఈ పాసులు జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కి.మీ.వరకు రాయితీ పాసు జారీ చేస్తారు. కళాశాల నుంచి (బోనిఫైడ్) సర్టిఫికెట్, విద్యార్థి ఫొటో జత చేయాలి. విద్యార్థి నెలవారీ, మూడు నెలలకోసారి సంవత్సరం పాసులు పొందవచ్చు. మంత్లీ పాసు ఐడీ కార్డుకు రూ.50, క్వార్టర్లీ, ఇయర్లీ పాసుల ఐడీ కార్డులకు రూ.100 చొప్పున చెల్లించాలి.

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ అందిస్తున్న ఉచిత, రాయితీ బస్సు పాసులను విద్యార్థులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రయాణ ఖర్చు ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే మొత్తం భరిస్తూ పాసులు అందిస్తోంది. జిల్లాలోని నాలుగు డిపోల ద్వారా పాసులు జారీ చేస్తున్నాం.
–శ్రీనివాసులు,ప్రజా రవాణా అధికారి, నంద్యాల

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

నంద్యాల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జేసీఎస్ నంద్యాల నియోజకవర్గంలో మండల ఇన్‌చార్జ్‌లను గురువారం ప్రకటించారు. నంద్యాల జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా ఎం.బసవేశ్వరరెడ్డి, గోస్పాడు మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా పామిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని నియమించారు. అలాగే పట్టణంలోని 42వార్డులకు ముగ్గురు ఇన్‌చార్జ్‌లను నియమించారు. 1 నుంచి 14 వార్డులకు జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా సయ్యద్ సలాముల్లా, 15 నుంచి 28 వార్డులకు సన్నల సాయిరాంరెడ్డి, 29 నుంచి 42వార్డుల వరకు షేక్ అమీర్‌బాషాను నియమించారు.

ఆళ్లగడ్డ: జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను వైఎస్సార్‌సీపీ గురువారం నియమించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆళ్లగడ్డకు రామకృష్ణ, ఆళ్లగడ్డ అర్బన్ ఇన్‌చార్జ్‌గా సుధాకర్‌రెడ్డి, చాగలమర్రి మండల ఇన్‌చార్జ్‌గా వెంకటరామిరెడ్డి, దొర్నిపాడుకు శివారెడ్డి, రుద్రవరానికి నగేశ్, ఉయ్యాలవాడకు గురుప్రసాద్‌ను నియమించినట్లు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం పేర్కొంది.

నాగాభరణం విరాళం

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీ ఓంకార సిద్ధేశ్వరస్వామికి నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామానికి చెందిన తిరుపతయ్య దంపతులు ఇత్తడి నాగాభరణం అందజేశారు. గురువారం ఆలయానికి వచ్చిన వారు స్వామి,అమ్మ వార్లను దర్శించుకుని అనంతరం ఈఓ నాగప్రసాద్, అర్చకులు చక్రపాణికి నాగాభరణం అందించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నంద్యాలటౌన్: రాష్ట్ర ఐఎంఏ సహకారంతో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీన పట్టణంలోని తిరుమల పునీత్ ఆసుపత్రి ప్రాంగణంలో డాక్టర్ అనిల్ కుమార్, హరిత ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

రక్తదానం
బక్రీద్ పండగ సందర్భంగా నంద్యాల రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఈద్గాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో ముస్లిం యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పాల్గొని నిర్వాహకులు, రక్తదాతలను అభినందించారు. రెడ్‌క్రాస్ అధ్యక్షుడు దస్తగిరి, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ లింగేశ్వరరావు, డాక్టర్ జఫ్రుల్లా పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకుడికి ప్రశంసా పత్రం అందజేస్తున్న కలెక్టర్ శామూన్, ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా

